## ఆర్జీ-3లో 89 శాతం బొగ్గు ఉత్పత్తి

### జీఎం సుధాకర్ రావు వెల్లడి

రామగిరి, మే 1: సింగరేణి ఆర్జీ-3 ఏరియాలో గడిచిన ఏప్రిల్ మాసంలో 89 శాతం బొగ్గు ఉత్పత్తి వెలికితీసినట్లు ఆర్జీ-3 జీఎం ఎన్ సుధాకర్ రావు వెల్లడించారు. ఆర్జీ-3 ఏరియాకు నిర్దేశించిన 5.75 లక్షల టన్నుల లక్ష్యానికి గానూ 5.09 లక్షల టన్నులతో 89శాతం బొగ్గు ఉత్పత్తి సాధించినట్లు తెలిపారు. అలాగే 43.0 లక్షల క్యూబిక్ మీటర్ల ఓబీ వెలికితీత లక్ష్యానికి 37.76 లక్షల క్యూబిక్ మీటర్లుతో 88 శాతం వెలికితీసినట్లు తెలిపారు. అలాగే 6.46 లక్షల టన్నుల బొగ్గు రవాణా చేయడం జరిగిందన్నారు. గనుల వారీగా ఓసీపీ-1కు నిర్దేశించి 3.0 లక్షల టన్నుల లక్ష్యానికి 3.0 లక్షల టన్నులతో 100 శాతం, ఓసీపీ-2లో 2.75 లక్షల టన్నుల లక్ష్యానికి 2.09 లక్షల టన్నులతో 76 శాతం ఉత్పత్తి చేయడం జరిగిందన్నారు. ఇందుకు కృషి చేసిన ఉద్యోగులకు అభినందనలు తెలిపారు. వేసవి కాలం ఉష్ణోగ్రతలకు అనుగుణంగా జాగ్రత్తలు పాటించాలని కోరారు.

**ఏపీఏ ఏరియాలో 84 శాతం**

కాగా, ఏపీఏ ఏరియాలోని అడ్రియాల లాంగ్‌వాల్ ప్రాజెక్టులో గడిచిన ఏప్రిల్ మాసంలో 84 శాతం బొగ్గు ఉత్పత్తి సాధించినట్లు ఏపీఏ జీఎం నాగేశ్వరరావు తెలిపారు. అడ్రియాల ప్రాజెక్టుకు 0.16 లక్షల టన్నుల లక్ష్యానికి గానూ 0.13 లక్షల టన్నులతో 84 శాతం ఉత్పత్తి చేయడం జరిగిందన్నారు. సింగరేణిలో కొత్తగా బదిలీ వర్కర్లుగా ఉద్యోగంలో చేరుతున్న వారు అధికారులు, సూపర్ వైజర్లు, సీనియర్ ఉద్యోగుల సలహాలు, సూచనలు పాటిస్తూ బాధ్యతాయుతంగా విధులు నిర్వర్తించాలని కోరారు.

## 30 ఏండ్ల సుదీర్ఘ పోరాట ఫలితం ఎస్సీ వర్గీకరణ

రామగిరి, మే 1: 30 ఏండ్ల సుదీర్ఘ పోరాట ఫలితం ఎస్సీ వర్గీకరణ అని జాతి ప్రయోజనాల కోసం పోరాడిన ధీరుడు మందకృష్ణ అని కమాన్‌పూర్ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ పూదరి సత్యనారాయణ గౌడ్ కొనియాడారు. మండలంలోని నాగెపల్లిలో ఎస్సీ వర్గీకరణ అమలును పురస్కరించుకొని బుధవారం ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో అంబేద్కర్, మందకృష్ణ మాదిగ చిత్రపటాలకు పాలాభిషేకం చేశారు. ముందుగా ఎస్సీ కాలనీ నుంచి ర్యాలీగా నాగెపల్లి చౌరస్తా వరకు ర్యాలీగా తరలివచ్చారు. ఆయన మాట్లాడుతూ, తెలంగాణ తొలి సీఎం కేసీఆర్ ఏ విధంగా యావత్ తెలంగాణ ప్రజానీకంను ఒక్కతాటిపైకి తీసుకవచ్చి తెలంగాణ సాధించారో అదేవిధంగా మందకృష్ణ మాదిగ సైతం మాదిగ రిజర్వేషన్ పోరాట సమితిని స్థాపించి సుదీర్ఘ కాలం పాటు పోరాటం సాగించి న్యాయ ప్రక్రియ ద్వారా వర్గీకరణను సాధించారన్నారు. దళిత ఐక్య వేదిక నాయకులు గద్దల శంకర్, ఊట్ల శ్రీను, పోయిల తిరుపతి, యాసం సతీష్, గద్దల ఓదెలు, శనిరం శ్రీనివాస్, శ్రావణ్, యాసం రాజయ్య, గద్దల పెద్ద కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## సమ్మర్ క్యాంపు ప్రారంభం

ఎలిగేడు, మే 1 : మండలకేంద్రంలోని ప్రభుత్వ పాఠశాలలో సమ్మర్ క్యాంపును మండల విద్యాధికారి నరేంద్రాచారి, మండల కాంప్లెక్స్ హెడ్మాస్టర్ గంద్ర దేవేందర్ రావు ప్రతిష్టాత్మకంగా ప్రారంభించారు. వారు మాట్లాడుతూ, పెద్దపల్లి కలెక్టర్ ఆదేశాల మేరకు ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకొరకు సమ్మర్ క్యాంపు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. మండలంలోని మొత్తం ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలల్లో 156 మంది విద్యార్థులు, పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, 15 మంది వలంటీర్లు పాల్గొన్నారు. ఈ సమ్మర్ క్యాంపుల్లో వలంటీర్లు విద్యార్థులకు మౌలిక భాష, గణిత సామర్థ్యంతో పాటు ఆటలు, డ్రాయింగ్, పెయింటింగ్‌లను నేర్పించనున్నట్లు తెలిపారు. గురువారం మొదటి రోజు విద్యార్థుల నుంచి మంచి స్పందన వచ్చింది. ఈ కార్యక్రమంలో ఎంఈవో నరేంద్రాచారి, మండల కాంప్లెక్స్ హెడ్మాస్టర్ గంద్ర దేవేందర్‌రావు, సీఆర్పీలు, పంచాయతీ కార్యదర్శులు, తదితరులు పాల్గొన్నారు.

## మదర్ థెరిస్సాలో ఇంటర్వ్యూ స్కిల్స్‌పై అవగాహన

పెద్దపల్లి రూరల్, మే 1: మండలంలోని పెద్దబొంకూర్‌లోని మదర్ థెరిస్సా ఇంజినీరింగ్ కళాశాలలో బుధవారం విద్యార్థులకు ఇంటర్వ్యూ స్కిల్స్‌పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్, రీసోర్స్ పర్సన్ డాక్టర్ టీ శ్రీనివాస్ మాట్లాడుతూ, నేటి పోటీ ప్రపంచంలో ఉద్యోగాలపై పోటీ ఎక్కువగా ఉన్న నేపథ్యంలో అందుకు సంబంధించిన స్కిల్స్‌పై పట్టు పెంచుకోవాల్సినవసరం ఎంతైనా ఉందని కళాశాల చైర్మన్ అడవల్లి నవీన్‌కుమార్ సూచించారు. మారుతున్న కాలానికి అనుగుణంగా అత్యాధునిక ప్రయోగశాలలు, మౌలిక వసతి సౌకర్యాలు కల్పించబడుతున్నాయన్నారు. ఈ అవకాశాలను ఈ ప్రాంత విద్యార్థులంతా సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. విద్యార్థుల నైపుణ్యాన్ని పెంపొందించడానికే ఇలాంటి కార్యక్రమాలు చేపట్టడం జరుగుతుందన్నారు. కళాశాల అకౌంట్స్ ఆఫీసర్ పవన్‌కుమార్, శిక్షణ, ప్లేస్‌మెంట్ అధికారి కె.వెంకటేశ్వర్లు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## మజ్జిగ పంపిణీకి ఆర్ఆర్ఆర్ శ్రీకారం

కోల్‌సిటీ, మే1: నిత్యం వెయ్యి మందికి తగ్గకుండా ఉచితంగా మజ్జిగ పంపిణీకి రామగుండం రిక్రియేషన్ క్లబ్ (ఆర్ఆర్ఆర్) శ్రీకారం చుట్టింది. ఈ మేరకు గోదావరిఖని ప్రధాన చౌరస్తాలో గురువారం నుంచి ఉచిత మజ్జిగ పంపిణీ కేంద్రంను అధ్యక్షులు, సీనియర్ న్యాయవాది అమరేందర్ రావు చేతుల మీదుగా ప్రారంభించారు. ఎండ తీవ్రత, వడగాలుల ప్రభావం రోజు రోజుకు అధికం కావడం, వడదెబ్బకు గురవుతున్న వరుస సంఘటనలు చూసి చలించి వేసవి తాపం నుంచి రక్షించేందుకు క్లబ్ సభ్యుల సహకారంతో ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. ప్రతి రోజూ వెయ్యి మందికి ఉచితంగా మజ్జిగ పంపిణీ చేస్తామన్నారు. కాగా, మొదటి రోజున రామగుండం మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్, క్లబ్ సభ్యుడు తానిపర్తి గోపాల్‌రావు-విజయలక్ష్మీ దంపతులు తమ వివాహ వార్షికోత్సవం సందర్భంగా ఉచిత మజ్జిగ పంపిణీకి చేయూత అందించారు. క్లబ్ సభ్యుల నిర్ణయంను పలువురు అభినందించారు. క్లబ్ బాధ్యులు విక్రమ సింహా రావు, మంతెన శ్రీనివాస్, సీహెచ్ బుచ్చిరెడ్డి, అశోక్ రావు, నిట్టూరి జీవన్ బాబు, రియాజ్ అహ్మద్, మల్లారెడ్డి, చెన్నారెడ్డి, సుధాకర్, నాగేశ్వరరావు, శ్రీనివాస్, చెల్కలపల్లి తిరుపతి, డా.కుమారస్వామి, వెంకటేష్, రాహుల్ తదితరులు పాల్గొన్నారు.


## నిషేధాజ్ఞలు కొనసాగింపు

ఫర్టిలైజర్‌సిటీ, మే 1: బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించడంపై అమల్లో ఉన్న నిషేధం, అనుమతి లేని డ్రోన్, డిజె సౌండ్స్‌పై ఉన్న నిషేధాజ్ఞలను ఈ నెల 1 నుంచి జూన్ 1వరకు పొడిస్తున్నట్లు రామగుండం పోలీసు కమిషన్ అంబర్ కిశోర్‌ఝా ప్రకటనలో పేర్కొన్నారు. సాధారణ పౌరులు, మహిళలు ఎదుర్కొంటున్న ఇబ్బందుల దృష్ట్యా బహిరంగ ప్రదేశాల్లో మద్యం నిషేధం, చిన్న పిల్లలు, రోగు లు, విద్యార్థుల విద్యాభ్యాసానికి భంగం కలగకుండా శబ్ధ కాలుష్యం నుంచి కాపాడేందుకు బారీ సౌండ్ వినియోగంపై నిషేధాజ్ఞలను కొనసాగుస్తున్నట్లు సీపీ ఉత్తర్వులు జారీ చేశామన్నారు. ఇట్టి నిషేధాజ్ఞలను ఉల్లంఘించిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు.

## మహాత్మా జ్యోతిబాపూలే గురుకుల విద్యార్థుల ప్రతిభ

మంథని రూరల్, ఏప్రిల్ 1: మండలంలోని గుంజపడుగుకు చెందిన మహాత్మా జ్యోతిబాపూలే గురుకుల పాఠశాలకు చెందిన విద్యార్థులు పదో తరగతి ఫలితాల్లో ఉత్తమ ఫలితాలు సాధించారు. పాఠశాలకు చెందిన వర్షిణి 565, వైష్ణవి 560, ఆశ్విత 556, సాత్విక 554 మార్కులు సాధించారు.

## గాలి దుమారంతో నేలకొరిగిన విద్యుత్ స్తంభాలు



విద్యుత్ వైర్లను పరిశీలిస్తున్న డీఈ ప్రభాకర్, అధికారులు

మంథని, మే 1: భారీగా వీచిన గాలి దుమారంతో విద్యుత్ స్తంభాలు నేలకొరగడంతో పాటు పిన్ ఇన్సులేటర్లు దెబ్బతినడం, కరెంట్ లైన్లు తెగి పోయాయని విద్యుత్ శాఖ డీఈ ప్రభాకర్ వెల్లడించారు. గాలిదుమారంతో నేలకొరిగిన స్తంభాలు, తెగిన కరెంట్ లైన్లను అధికారులు, సిబ్బందితో కలిసి గురువారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, బుధవారం రాత్రి వీచిన భారీ ఈదురు గాలులతో 27 స్తంభాలు నేలకొరిగాయన్నారు. పట్టణంతో పాటు ఆయా గ్రామాల్లో విద్యుత్ సరఫరా నిలిచి పోయిందన్నారు. విద్యుత్ సరఫరాను తిరిగి పునఃరుద్దరించేందుకు ప్రత్యేక చర్యలు తీసుకున్నామని, తమ సిబ్బంది రాత్రంతా కష్టపడి ప్రజలకు ఇబ్బంది లేకుండా విద్యుత్‌ను సరఫరా చేశారన్నారు. సీఎండీ కర్నాటి వరుణ్‌రెడ్డి, ఇతర అధికారులు కంట్రోల్ రూమ్ నుంచి నిరంతరం సరఫరా తీరును పర్యావేక్షించడంతో పాటు సూచనలు చేశారన్నారు. మంథని, బోయినిపేట, సూరయ్యపల్లి, గోపాల్‌పూర్, ఎక్లాస్‌పూర్, పుట్టపాక, ముత్తారం మండలంలోని ఖమ్మంపల్లి, కేశనపల్లి గ్రామాల్లో గాలిదుమారంతో విద్యుత్ శాఖకు ఎక్కువగా నష్టం వాటిల్లిందన్నారు. నేలకొరిగాన కరెంట్ స్తంభాలను మార్చడంతో పాటు విద్యుత్ లైన్లను మరమ్మత్తులు చేసి విద్యుత్ సరఫరాలో అంతరాయం లేకుండా చూస్తామన్నారు.

## యూనిఫాం స్టిచ్చింగ్ ప్రారంభం..

ముత్తారం, మే 01: మండలంలోని ప్రభుత్వ పాఠశాలలకు చెందిన విద్యార్థులకు ప్రభుత్వ పరంగా యూనిఫాం అందించేందుకు పనులను శ్రీ వినాయక మహిళా శక్తి టైలరింగ్ సెంటర్‌కు అప్పగించారు. ఈ మేరకు గురువారం ఎంపీడీవో సురేశ్, ఐకేపీ ఏపీఎం పద్మ, ఎంఈవో హరిప్రసాద్ యూనిఫాం స్టిచ్చింగ్ పనులను ప్రారంభించారు. 2025-26 విద్యా సంవత్సరానికి గాను మండలంలోని 1 నుంచి ఇంటర్మీడియెట్ ద్వితీయ సంవత్సరం వరకు చదువుతున్న 1418 మంది విద్యార్థుల కోసం ఈ మహిళా శక్తి టైలరింగ్ సెంటర్ ద్వారనే యూనిఫాం స్టిచ్చింగ్ చేయిస్తున్నట్లు తెలిపారు.



సుల్తానాబాద్‌రూరల్ : ఐతరాజ్‌పల్లిలో జెండా ఎగురవేస్తున్న కార్మికులు



కాల్వశ్రీరాంపూర్: ర్యాలీ తీస్తున్న హమాలీ కార్మికులు



గోదావరిఖని: మేడే పతాకంతో ర్యాలీ తీస్తున్న కార్మిక సంఘాల నాయకులు

# ఊరూరా మేడే వేడుకలు

- గనులపై రెపరెపలాడిన ఎర్రజెండాలు • పాల్గొన్న ప్రజాప్రతినిధులు, సంఘాల నాయకులు



జ్యోతినగర్ : మేడే వేడుకల్లో ఎన్టీపీసీ ఈడీ, జీఎంలు, అధికారులు

జ్యోతినగర్/గోదావరిఖని/జ్యోతినగర్/ఫర్టిలైజర్‌సిటీ/గోదావరిఖని/ముత్తారం/ ధర్మారం/మంథని/ యైటింక్లయిన్‌కాలనీ/జ్యోతినగర్/జూలపలి/కాల్వశ్రీరాంపూర్ /ఎలిగేడు/అంతర్గాం/సుల్తానాబాద్‌రూరల్/ రామగిరి : జిల్లాలో మేడే వేడుకలు గురువారం ఘనంగా నిర్వహించారు. కార్మిక సంఘాలు, రాజకీయ పార్టీ నాయకులు ఊరూరా ర్యాలీ తీసి ఎర్ర జెండాలను ఎగురవేశారు. చికాగో అమరవీరుల పోరాట ఫలితంగా సాధించిన అనేక హక్కులను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు హరిస్తున్నాయని, కార్మికుల సమస్యలపై అన్ని వర్గాల వారు సంఘటితంగా పోరాడాలని పలువురు సూచించారు. కార్మిక వ్యతిరేక చట్టాలను సవరించాలని డిమాండ్ చేశారు. రామగిరి మండలంలోని సింగరేణి ఆర్జీ-3, డిపార్ట్‌మెంట్‌లో టీబీజీకేఎస్ ఆధ్వర్యంలో జెండా ఎగురవేసి, చికాగో అమరవీరులకు నివాళులర్పించారు. యూనియన్ ఉపాధ్యక్షుడు నాగెల్లి సాంబయ్య సంఘటిత అసంఘటిత కార్మికులకు మేడే శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ జనరల్ సెక్రటరీ పింగళి సంపత్ రెడ్డి, పాశం శ్రీనివాస్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు. సుల్తానాబాద్ రూరల్ మండలంలోని ఐతరాజ్‌పల్లిలో హమాలీ సంఘం ఆధ్వర్యంలో సంఘం అధ్యక్షుడు జాతరగోడ ఐలయ్య జెండాను ఎగురవేశారు. మాజీ ఎంపీటీసీ దీకొండ భూమేశ్ కుమార్, హమాలీ సంఘం కార్యదర్శి నారాయణ పాల్గొన్నారు. అంతర్గాం మండల కేంద్రంలో సీఐటీయూ మండల నాయకులు తోడూరు శ్రీనివాస్, ఎంపీడీవో ఆఫీసు వద్ద జీపీ యూనియన్ మండల కార్యదర్శి సురేశ్, అంతర్గాంలో తమ్మినవేన శంకర్, గోలివాడలో పోచం, బ్రాహ్మణపల్లి గ్రామంలో బిల్డింగ్ యూనియన్ నాయకులు కండె శ్రీనివాస్, పొట్యాలలో విజయలక్ష్మి జెండాలను ఆవిష్కరించారు. ఎలిగేడు మండలంలోని రాములపల్లిలో కార్మిక జెండా ఎగురవేసి, అమరవీరులకు నిరవాళులర్పించారు. అధ్యక్షుడు సతీశ్, తిరుపతి, మల్లేశ్, టీ విజయ్, పీ గౌరయ్య, సీహెచ్ లక్ష్మణ్, సిద్ది తిరుపతి, టీ పరశురాములు పాల్గొన్నారు. కాల్వశ్రీరాంపూర్ మండలంలోని అన్ని గ్రా మాల్లో ఘనంగా నిర్వహించారు. కార్మిక సంఘాల నాయకులు, మాజీ ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు. జూలపల్లి, పెద్దాపూర్, అబ్బాపూర్ గ్రామాల్లో ప్రపంచ కార్మిక దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐటీయూ ఆధ్వర్యంలో అరుణ పతాకాలు ఎగురవేశారు. జ్యోతినగర్ ఎన్టీపీసీలో ఐఎఫ్‌టీయూ ఆధ్వర్యంలో మేడే ప్రదర్శన ర్యాలీ తీశారు. ఐఎఫ్‌టీయూ రాష్ట్ర అధ్యక్షుడు కృష్ణ, జిల్లా అధ్యక్షుడు నరేశ్, ఉపాధ్యాక్షుడు శంకర్, నాయకులు బీ బుచ్చన్న, కొమురయ్య ఉన్నారు. సీఐటీయూ ఆధ్వర్యంలో ఎన్టీపీసీ లేబర్‌గేట్‌లో దండ రాఘవరెడ్డి, మేడిపల్లి సెంటర్‌లో లక్ష్మారెడ్డి, వారంతపు సంతాలో పోచం, ఇందిరమ్మకాలనీలో ముత్తునూరు సంపత్, రామగుండం రైల్వే డిపోవద్ద కే తిరుపతి, బిల్డింగ్ వర్కర్స్ యూనియన్ కార్యాలయంలో గుండు కనుకయ్య మేడే పతకాన్ని ఆవిష్కరించగా, సీఐటీయూ జిల్లా కోశాధికారి ఎం రామాచారి ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. యైటింక్లయిన్‌కాలనీ సింగరేణి ఆర్జీ-2 ఏరియాలో మేడే కార్మికులు, కార్మిక సంఘాలు ఘనంగా నిర్వహించారు. టీబీజీకేఎస్ ఆధ్వర్యంలో యూనియన్ కార్యాలయం వద్ద సంఘం డివిజన్ ఉపాధ్యక్షుడు ఐలి శ్రీనివాస్ జెండా ఎగురవేశారు. ఏఐటీయూసీ ఆధ్వర్యంలో సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ ఏఐటీయూసీ డివిజన్‌లో, గనులపై, యూనియన్ కార్యాలయాల వద్ద జెండాలను ఎగురవేసి మేడే నిర్వహించారు. యూనియన్ కార్యాలయం వద్ద బ్రాంచి కార్యదర్శి జీగురు రవీందర్ జెండా ఎగురవేశారు. ఐఎఫ్‌టీయూ ఆధ్వర్యంలో గోదావరి లోయ బొగ్గుగని కార్మిక సంఘం ఆధ్వర్యంలో కార్మికులు ర్యాలీ తీశారు. కార్యక్రమంలో బీ అశోక్, బుచ్చమ్మ,కే శారద పాల్గొన్నారు. మంథనిలో మండల న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో మేడే నిర్వహించారు. కార్మిక హక్కులపై అవగాహన కలిగి ఉండాలని మంథని కోర్టు సీనియర్ సివిల్ జడ్జి భవాని సూచించారు. ప్రిన్సిపాల్ జూనియర్ సివిల్ జడ్జి కీర్తిసింహ, ద్వితీయ శ్రేణి న్యాయమూర్తి అనురాధ, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు హరిబాబు పాల్గొన్నారు. ధర్మారట మండల కేంద్రంలోని వ్యవసాయ మార్కెట్ కార్యాలయం ఎదుట సీఐటీయూ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ సీపెల్లి రవీందర్ ఆధ్వర్యంలో స్థానిక హమాలీ సంఘం సీనియర్ నాయకుడు మేడవేని రాజలింగు కార్మిక జెండాను ఎగురవేశారు. ముత్తారం మండల కేంద్రంలో ఏఐటీయూసీ ఆధ్వర్యంలో మండలంలోని అడవీ శ్రీరాంపూర్ గ్రామంలో నాయకులు ఎర్ర జెండాను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో కళాకారులు దుబాసి శ్రీనివాస్, గోస్కుల రమేశ్, సమ్మయ్య, సింగల్ విండో వైస్ చైర్మన్ పోతిపెద్ది రమణా రెడ్డి, నాయకులు, గ్రామస్తులున్నారు. గోదావరిఖని పట్టణంలో సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ ఏఐటీయూసీ 139 మీటర్ల మేడే పతకాంతో భారీ ర్యాలీ నిర్వహించారు. ఏఐటీయూసీ ఆర్జీ-1 బ్రాంచీ ఉపాధ్యాక్షుడు మాదన మహేశ్, సహాయ కార్యదర్శి రంగు శ్రీను, సాయన్న, తదితరులు ఉన్నారు. ఫర్టిలైజర్‌సిటీ లో ఆర్ఎఫ్‌సీఎల్ మజ్దూర్ యూనియన్ ఆధ్వర్యంలో కర్మాగారం ఎ గేట్ వద్ద యూనియన్ అధ్యక్షుడు అంబటి నరేశ్ మేడే పతకాన్ని ఆవిష్కరించారు. జ్యోతినగర్‌లో ఎన్టీపీసీ ప్లాంటులోని మేడే పార్కులో ఘనంగా జరిగింది. ఎన్టీపీసీ ఎగ్జిక్యూటీవ్ డైరెక్టర్ చందన్‌కుమార్ సమంత ముఖ్యఅతిథిగా హాజరై మేడేకు గుర్తుగా హెచ్‌వోపీ ఎన్టీపీసీ జెండాను ఎగురవేశారు. ఎన్టీపీసీ ఆపరేషన్ అండ్ మెయింటెన్సీ జీఎం అలోక్‌కుమార్ త్రిపాఠి, ఆపరేషన్ జీఎం కేసీ సింఘారాయ్, ఏజీఎం హెచ్ఆర్ బిజోయ్‌కుమార్ సిక్దర్, ఎన్టీపీసీ ఎన్‌బీసీ మెంబర్ బాబర్ సలీంపాష, ఉన్నతాధికారులు ఉన్నారు. గోదావరిఖనిలో మోదీ ప్రభు త్వం అనుసరిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలకు నిరసనగా మేడే స్ఫూర్తితో పోరాడుదామని ఐఎఫ్‌టీయూ రాష్ట్ర అధ్యక్షుడు ఐ కృష్ణ పిలుపునిచ్చారు. ఇంక్లైన్ గనుల వద్ద మేడే పతాకాలను ఆవిష్కరించారు. నాయకులు ఈ నరేశ్, ఈదునూరి రామకృష్ణ, రాజేశ్, కొండ్ర మొగిళి, దుర్గయ్య ఉన్నారు.

జ్యోతినగర్‌లో మేడేను పురస్కరించుకొని ఎన్టీపీసీ యాజమాన్యం స్థానిక ఎన్టీపీసీ ఈడీసీ మిలినీయం హాల్‌లో ఎన్టీపీసీ కాంట్రాక్ట్ కార్మికులకు హక్కుల పరిరక్షణ, ప్రాముఖ్యత, చట్టపరమైన హక్కులపై అవగాహన కల్పించారు. కనీస వేతనాల, పీఎఫ్, బీమా, ప్రసూతి ప్రయోజనాలు, సమాన వేతనాలు, విజిలెన్స్, ఫిర్యాదుల పరిష్కారంపై విజిలెన్స్ ఏజీఎం సుధాకర్ భోగరాజు పవర్‌పాయింట్ ప్రజంటేషన్‌తో వివరించారు.




మంథని : హక్కులపై అవగాహన కల్పిస్తున్న న్యాయమూర్తి భవాని

## మహిళల ఆర్థిక అభివృద్ధే ప్రభుత్వ లక్ష్యం : మంత్రి

మంథని, మే 1 : మహిళలు ఆర్థిక అభివృద్ధే ప్రభుత్వ లక్ష్యమని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు అన్నారు. మంథని మున్సిపల్ కార్యాలయ ప్రాంగణంలో శ్రీపాద కుట్టు మిషన్ కేంద్రం, ఇందిరా మహిళా శక్తి ద్వారా ఏర్పాటు చేసిన రూ.2.5 లక్షల విలువ గల మొబైల్ క్యాంటీన్, మార్కెట్ ఏరియాలో రూ. 5 లక్షల విలువ గల నైనిక నైటీస్ అండ్ ఫ్యాషన్‌వేర్ మ్యాచింగ్ సెంటర్‌ను కలెక్టర్ కోయ శ్రీహర్షతో కలిసి మంత్రి శ్రీధర్‌బాబు గురు వారం ప్రారంభించారు. అదే విధంగా పాత పాల కేంద్రంలో ఉచిత కుట్టు మిషన్ శిక్షణ కేంద్రం ఏర్పాటుకు అనువైన స్థలాన్ని ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, మహిళలకు ఆదాయం మార్గాలు పెరగాలి, వారి కుటుంబాలు ఆర్థికంగా పటిష్టం కావాలనే ఉద్దేశ్యంతో ప్రభుత్వం ఇందిరా మహిళా శక్తి కార్యక్రమాన్ని ప్రారంభించిందన్నారు. ఆర్డీవో సురేష్, తహసీల్దార్ కుమార స్వామి, మున్సిపల్ కమిషనర్ మనోహర్ ఉన్నారు.

## క్రీడా స్ఫూర్తిని చాటాలి



క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న రఘువీర్‌సింగ్

జూలపల్లి, మే 1: ఆటల పోటీల్లో గెలుపోటములు సహజమేనని, ప్రతి క్రీడాకారుడు క్రీడా స్ఫూర్తిని చాటి ఆదర్శంగా నిలవాలని జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ రఘువీర్‌సింగ్ సూచించారు. జూలపల్లిలోని ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాల ప్రాంగణంలో గురువారం జిల్లా యువజన క్రీడల శాఖ ఆధ్వర్యంలో వేసవి వాలీబాల్ శిక్షణ శిబిరాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, క్రీడలు ఉపాధి, ఉద్యోగావకాశాలకు బాటలు వేస్తాయని పేర్కొన్నారు. విద్యను విస్మరించకుండా ఆటలపై ప్రత్యేక దృష్టి పెట్టాలని తెలిపారు. అలాగే తేలుకుంటలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఆవరణలో 'తైక్వాండో' శిక్షణ శిబిరం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో నిర్వాహకులు కూసి రాఖేశ్, నేవూరి సతీశ్‌కుమార్, వాలీబాల్ సీనియర్ క్రీడాకారులు భూసారపు రవీందర్‌గౌడ్, దామెర కమలాకర్‌రెడ్డి, బొమ్మనవేని సతీశ్, ఆవుల రాజు, మల్లెత్తుల సంతోశ్ తదితరులు పాల్గొన్నారు.

## అందుబాటులో పెసరు విత్తనాలు

పెద్దపల్లి, మే1: యాసంగి సాగు కోసం 30 క్వింటాళ్ల ఐపీఎం -410-3(శిఖా) అనే పెసరు రకం విత్తనాలు అందుబాటులో ఉన్నాయని డీఏవో దోమ ఆదిరెడ్డి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ రకం భారత పప్పు ధినుసుల పరిశోదన సంస్థ ఖాన్పూర్ నుంచి 2016లో విడుదల అయిందని, పంట కాలం 65-70 రోజులు. ఎకరానికి 8-10 క్వింటాళ్ల దిగుబడి వస్తుందని పేర్కొన్నారు. కిలో ధర రూ. 148 ఉంటుందని, ఎకరానికి 8 కిలోల విత్తనం అవసరం అవుతుందన్నారు. పెసరు విత్తనాలు కావాల్సిన రైతలు పెద్దపల్లి డీసీఎంఎస్, సుల్తానాబాద్ పీఏసీఎస్, బేగంపేట ఏఆర్ఎస్‌కే, మంథని ఏఆర్ఎస్‌కే, కాల్వ శ్రీరాంపూర్ పీఏసీఎస్, నందిమేడారం పీఏసీఎస్ సెంటర్లలో సంప్రదించాలని సూచించారు.

# ధాన్యం తరలింపులో జాప్యం చేయొద్దు

### జిల్లా అదనపు కలెక్టర్ వేణు



వివరాలు తెలుసుకుంటున్న జిల్లా అదనపు కలెక్టర్ వేణు

ముత్తారం, మే 1: ధాన్యం కొనుగోళ్లలో జాప్యం చేయొద్దని అదనపు కలెక్టర్ డీ వేణు సూచించారు. మండలంలోని కేశనపల్లి గ్రామంలో ఐకేపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆయన గురువారం సందర్శించారు. ఈ సందర్భంగా ధాన్యం కొనుగోలు వివరాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం తహసీల్దార్ కార్యాలయంలో సమావేశం ఏర్పాటు చేసి, మాట్లాడారు. మండలంలో ఇప్పటి ఎంత మేర ధాన్యం కొనుగోల్లు జరిగాయని, ఎంత వరకు మిల్లులకు తరలించారో ఆరా తీశారు. అకాల వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో రైతులకు ఎలాంటి ఇబ్బందులు ఎదురవ్వకుండా ఎప్పటికప్పుడు కొనుగోలు చేయడంతోపాటు కొనుగోలు చేసిన ధాన్యాన్ని మిల్లులకు తరలించాలని, కొనుగోళ్ల విషయంలో ఎవరూ నిర్లక్ష్యం వహించిన చర్యలు తప్పవని హెచ్చరించారు. తహసీల్దార్ మధుసూదన్ రెడ్డి, డిప్యూటీ తహసీల్దార్ షఫీ పాల్గొన్నారు.

# చదువుతో పాటు క్రీడల్లో రాణించాలి



మాట్లాడుతున్న జీఎం

యైటింక్లయిన్‌కాలనీ, మే 1 : విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో రాణించాలని ఆర్జీ-2 జీఎం బండి వెంకటయ్య అన్నారు. బుధవారం రాత్రి అబ్దుల్ కలామ్ క్రీడా మైదానంలో సింగరేణి డబ్ల్యూపీఎస్ స్పోర్ట్స్ అండ్ గేమ్స్ ఆధ్వర్యంలో నిర్వహించిన వేసవి ఉచిత క్రీడల శిక్షణ శిబిరాన్ని ప్రారంభించి మాట్లాడారు. యాజమాన్యం బొగ్గు ఉత్పత్తితోపాటు కార్మిక కుటుంబాల సంక్షేమం కోసం ఎంతో కృషి చేస్తోందన్నారు. అందులో భాగంగానే కార్మికుల పిల్లల కోసం ప్రతియేడు వివిధ క్రీడల్లో శిక్షణ తరగతులను నిర్వహించి ప్రోత్సహిస్తుందని తెలిపారు. ఈ శిబిరాల్లో పిల్లలు తమ ఆసక్తి యున్న క్రీడల్లో నైపుణ్యాన్ని పెంపొందించుకుని జిల్లా, రాష్ట్ర స్థాయితోపాటు అంతర్జాతీయ స్థాయిలో రాణించి సింగరేణి కీర్తిని చాటాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్వోటుజీఎం రాముడు, డీజీఎం (ప) ఎస్. అనిల్ కుమార్, క్రీడల సూపర్‌వైజర్ నరేందర్ రెడ్డి, ఏఐటీయూసీ బ్రాంచి కార్యదర్శి జీగురు రవీందర్, సెక్యూరిటీ అధికారి షరీఫ్ మహమ్మద్, క్రీడల కార్యదర్శి వేణుగోపాల్, కోఆర్డినేటర్ పోశం, దేవా రెడ్డి, సంతోష్ తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థులతో కలెక్టర్ కోయ శ్రీహర్ష

## విద్యార్థులను అభినందించిన కలెక్టర్

పెద్దపల్లి ,మే1: ఇటీవల విడుదల చేసిన ఎస్సెసీ, ఇంటర్మీడియట్ వార్షిక పరీక్షల ఫలితాల్లో ఉత్తమ ప్రతిభ చూపిన విద్యా ర్థులను కలెక్టర్ కోయ శ్రీ హర్ష అభినందనలు తెలిపారు. గురువారం కలెక్టరేట్‌లో ఉత్తమ ఫలితాలు సాధించిన మంథని సాంఘిక సంక్షేమ బాలుర గురుకుల పాఠశాల, కళాశాల, మైనార్టీ బాలికల గురుకుల కళాశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు మర్యాదపూర్వకంగా కలిశారు. మంథని సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల 10వ తరగతి ఫలితాల్లో 100 శాతం ఉత్తీర్ణత సాధించిందని, ఎం అజయ్ కుమార్ 573, ఆర్ అభినవ్ 566, ఆర్ కౌశిక్ భార్గవ్ 563, పీ చందు 561, డీ శివ చరణ్ తేజ 558 మార్కులు సాధించారని తెలిపారు. ఇంటర్మీడియట్ ఫలితాలలో మంథని సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల/కళాశాల (బాలురు) 96శాతం ఉత్తీర్ణతతో రాష్ట్ర స్థాయిలో అత్యుత్తమ ఫలితాలు సాధించారని, ఎంపీసీలో జే శ్రీనివాస్ 983, జే సంతోష్ 963 సాధించారని తెలిపారు. ఈమేరకు మంచి మార్కులు సాధించిన విద్యార్థులను, అందకు కృషి చేసిన ఉపాధ్యాయలను కలెక్టర్ ప్రత్యేకంగా అభినందించారు. సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ శ్రీనాథ్, మైనార్టీ రెసిడెన్షియల్ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ అస్మా జబీన్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## గడువు పొడగింపు

పెద్దపల్లి, మే1: ఐదు శాతం రాయితీ ఆస్తి పన్ను చెల్లింపునకు ఈనెల 7వ తేదీ వరకు ప్రభుత్వం గడువు పొడగించిందని మున్సిపల్ కమిషనర్ ఆకుల వెంకటేశ్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. 2025 -26 ఆర్థిక సంవత్సర ఆస్తి పన్ను నిర్ణీత కాలవ్యవధిలో చెల్లించి రాయితీ పొందాలని పట్టణ ప్రజలను కోరారు.

## పారిశుధ్య నిర్వహణ సక్రమంగా చేపట్టాలి

ముత్తారం, మే 1: పకడ్బందీగా గ్రామాల్లో పారిశుధ్య నిర్వహణ చేపట్టాలని మంథని డీఎల్పీవో కే సతీశ్ కుమార్ అధికారులకు సూచించారు. మండలంలోని సీతంపేట, ఖమ్మంపల్లి గ్రామాల్లో డీఎల్పీవో గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయా గ్రామ పంచాయతీల్లో రికార్డులను పరిశీలించారు. గ్రామాల్లో సందర్శించి పారిశుధ్య పనులను పర్యవేక్షించారు. పంచాయతీ అనుమతి లేకుండా గ్రామాల్లో ఎలాంటి నిర్మాణాలు చేపట్టరాదన్నారు.పంచాయతీ కార్యదర్శులున్నారు.

## 'పది'లో సత్తా చాటిన సెక్టార్ 2 పాఠశాల

గోదావరిఖని, మే 1: స్థానిక సెక్టార్ 2 సింగరేణి పాఠశాల విద్యార్థులు కార్పొరేట్ పాఠశాలలకు ధీటుగా పదోతరగతి పరీక్షలో మంచి మార్కులు సాధించినట్లు ఆర్జీ-1 సింగరేణి అధికార ప్రతినిధి ప్రకటనలో పేర్కొన్నారు. సింగరేణి ఎడ్యుకేషన్ సొసైటీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న పాఠశాలలో ఉత్తమంగా మొదటి, మూడు, నాలుగు స్థానాల్లో నిలిచారు. 8మంది విద్యార్థులు ఐదు వందలకు పైగా మార్కుల సాధించి తమ సత్తాను చాటుకున్న ట్లు తెలిపారు. కే అస్మితకు 559 మార్కులు, బీ మనస్వికి 555 మార్కులు, ఎంలోహితకు 554 మార్కులు, అర్థంకు 549 మార్కులు వచ్చాయి. మొదటి స్థానంలో నిలిచిన కె అస్మితను ఆర్జీ-1 జీఎం లలిత్‌కుమార్, పాఠశాల కరస్పాండెంట్ కిరణ్‌బాబు, ఇన్‌చార్జి హెచ్‌ఎం స్వర్ణలతలు అభినందించినట్లు తెలిపారు.

## రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి

సుల్తానాబాద్ రూరల్, మే 1 : మండలంలోని నర్సయ్యపల్లి గ్రామశివారులోని రాహదారిపై జరిగిన రోడ్డు ప్రమాదాంలో ఒకరు మృతి చెందారు. పలువరికి గాయాలు కాగా దవాకానకు తరలించారు. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి.. మంచిర్యాల్‌కు చెందిన ఐదుగురితో పాటు మంచిర్యాల్ జిల్లాలోని రాళ్లపేటకు చెందిన సోయబ్ (24) ఆటో డైవర్‌తో కలిసి అవసరం కోసం గురువారం కరీంనగర్ వచ్చారు. తిరుగు ప్రయాణంలో సుల్తానాబాద్ మండలంలోని నర్సయ్యపల్లి గ్రామ శివారులోని రాహదారిపై ముందు ఉన్న వాహనాన్ని తప్పించబోయి ప్రమాదవశాత్తు ఆటో బోల్తా పడింది. అందులో ప్రయాణిస్తున్న వారికి గాయాలు కాగా, డైవర్ సోయబ్‌కు తీవ్ర గాయాలు కాగా, స్థానికులు 108కు సమాచారం అందజేశారు. విషయం తెలుసుకున్న ఇన్‌చార్జి ఎస్ఐ నరేశ్ కుమార్ సంఘటనా స్థలానికి చేరుకొని గాయపడ్డ వ్యక్తిని పోలీసు వాహనంలో ఏరియా ప్రభుత్వ దవాఖానకు తరలించగా, సోయబ్ మృతి చెందాడు. గాయపడ్డ వారిని కరీంనగర్ దవాఖానకు తరలించారు.

## వడ దెబ్బతో హమాలీ కార్మికుడు..

మంథని, మే 1: స్థానిక గంగాపురికి చెందిన పులి మణి(55) హమాలీ కార్మికుడు వడదెబ్బతో గురువారం మృతి చెందాడు. కుటుంబ సభ్యులు, స్థానికుల కథనం ప్రకారం.. గంగాపురిలోని వరిధాన్య కొనుగోలు కేంద్రానికి హమాలీ పనికి వెళ్లి ఇంటికి వచ్చిన మణి అస్వస్థతకు గురయ్యాడు. అతన్ని కుటుంబ సభ్యులు చికిత్స కోసం మంథని దవాఖానకు తరలించగా పరిస్థితి విషమంగా ఉండడంతో గోదావరిఖని ఆసుపత్రికి తరలించారు. అయితే అప్పటికే అతను మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. మృతుడికి భార్య, కుమారుడు, కూతురు ఉన్నారు.

## జిల్లా వైద్యాధికారిపై కేసు పెట్టడం హేయమైన చర్య

పెద్దపల్లి టౌన్, మే 1: జిల్లా వైద్యాధికారి అన్నప్రసన్న కుమారిపై అక్రమంగా గోదావరిఖని శ్రీమమత ప్రైవేట్ దవాఖాన సిబ్బంది తప్పుడు కేసు అక్రమంగా నమోదు చేయడం హేయమైన చర్యని పెద్దపల్లి ప్రభుత్వ దవాఖాన డీసీహెచ్ఎస్ శ్రీధర్ అన్నారు. గురువారం దవాఖానలో డాక్టర్లు, సిబ్బంది కలిసి జిల్లా వైద్యాధికారికి మద్దతు తెలుపుతూ, గోదావరిఖని శ్రీమమత ప్రైవేట్ దవాఖాన వైఖరిని నిరసిస్తూ నల్లా బ్యాడ్జీలు ధరించి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ శ్రీధర్ మాట్లాడుతూ, జిల్లా వైద్యాధికారి అన్నప్రసన్న కుమారి ఏప్రిల్ మాసంలో గోదావరిఖని శ్రీమమత ప్రైవేట్ దవాఖానలో అనుమతి లేకుండా అల్ట్రాసౌండ్ స్కానింగ్ మిషన్ నడుపుతున్నారనే ఫిర్యాదు మేరకు విచారణకు వెళ్లిన జిల్లా వైద్యాధిరినిపై దవాఖాన యజమాన్యం సిబ్బందితో కలిసి తప్పుడు కేసు నమోదు చేయించారని ఆరోపించారు. విధి నిర్వహణలో డ్యూటీలో ఉన్న డాక్టర్‌పై ప్రైవేట్ దవాఖాన యజమాన్యం అలా వ్యవహరిండం సరియైంది కాదన్నారు. ప్రజలు, మేథావులు, న్యాయవాధులు, ప్రజాప్రతినిధులు జిల్లా విద్యాధికారికి మద్దతు తెలుపాలని కోరారు. ఇక్కడ డాక్టర్లు, సిబ్బంది ఉన్నారు.